సాక్షి పల్నాడు

మంగళవారం । 3 । సెప్టెంబర్ । 2024

సందర్శకులను అనుమతించవద్దు



ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి

తాడేపల్లి రూరల్: సీతానగరం పుష్కర ఘాట్ వద్ద వరద ఉధృతిని ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి సోమవారం పరిశీలించారు. అక్కడ విధుల్లో ఉన్న పోలీసు అధికారుల్ని అప్రమత్తం చేశారు. పుష్కర ఘాట్, ప్రకాశం బ్యారేజీ వద్దకు సందర్శకులను అనుమతించవద్దని ఆదేశించారు. కృష్ణానది ఉధృతంగా ప్రవహిస్తున్న దృష్ట్యా ప్రమాదాలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఆయన వెంట మంగళగిరి డీఎస్పీ రాంబాబు, సీఐ కల్యాణ్‌రాజు తదితరులు ఉన్నారు.

శాంతించని కృష్ణమ్మ

కొనసాగుతున్న వరద ఉధృతి

- అమరావతిలో నీట మునిగిన పలు కాలనీలు
- అమరలింగేశ్వర దేవాలయం పరిసరాల్లో వరద నీరు
- వైకుంఠపురం కరకట్ట వద్ద ప్రమాద ఘంటికలు
- పునరుద్ధరణ కాని లోతట్టు గ్రామాల రాకపోకలు
- పంట పొలాల్లోనే వరద నీరు
- నష్టపోతున్న రైతులు
- ప్రాథమిక నష్ట అంచనాలు రూపొందిస్తున్న వ్యవసాయ, ఉద్యాన శాఖలు

సాక్షి, నరసరావుపేట: అల్పపీడన ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు తోడు, పై నుంచి వస్తున్న వరదతో కృష్ణమ్మ శాంతించలేదు. రికార్డు స్థాయిలో 11.4 లక్షల క్యూసెక్కులకు పైగా వరద నీరు ప్రవహిస్తుండటంతో నది పరీవాహక ప్రాంతాల్లోని ప్రజలు క్షణక్షణం భయంగా గడుపుతున్నారు. మరోవైపు ఆది, సోమవారం రోజుల్లో జిల్లాలో ఎక్కడా పెద్దస్థాయిలో వర్షం కురవకపోవడంతో కొంత ప్రమాదం తగ్గిందనే చెప్పుకోవాలి. జిల్లాలో నూజెండ్లలో 4.8మిమీ, వినుకొండలో 4.4 మిమీ వర్షపాతం నమోదైంది. అమరావతి, అచ్చంపేటలలో ఒక మి.మీటరు మినహా మిగిలిన మండలాల్లో వర్షపాతం నమోదు కాలేదు. మంగళవారం కూడా వర్షాలు పడే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ సమాచారం మేరకు జిల్లా అధికారయంత్రాంగం అవసరమైన చర్యలను తీసుకుంటోంది. జిల్లాలో ఇంకా పంట పొలాల్లో చేరిన వరద నీరు పూర్తిస్థాయిలో తగ్గకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదముంది. ముఖ్యంగా పత్తి, వరి, మిర్చి పంటలు రైతులు వరద ముంపునకు ఇబ్బందులు పడుతున్నారు.

14 పునరావాస కేంద్రాలు

భారీ వర్షాలు, వరదల వల్ల జిల్లా వ్యాప్తంగా 25,324 మంది ప్రజలు ఇబ్బంది పడుతున్నట్టు ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. 14 పునరావాస కేంద్రాలలో 4,550 మంది నిర్వాసితులు తలదాచుకుంటున్నారు. జిల్లాలో వరద ప్రభావిత ప్రాంతాల్లో 14 మెడికల్ క్యాంపులను ఏర్పాటుచేశారు. జిల్లాలో రెండు ఎస్డీఆర్ఎఫ్ బృందాలు సిబ్బంది వరద సహాయక చర్యలలో పాల్గొంటున్నాయి.



అచ్చంపేటలోని పునరావాస కేంద్రంలో బాధితులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న అధికారులు



నీటమునిగిన అమరావతి ఏరియల్ చిత్రం

బల్లకట్టు సర్వీసులు నిలిపివేత

వరద ఉధృతి పూర్తిగా తగ్గే వరకు కృష్ణానదిలో తిరిగే పడవలు, బల్లకట్టు సర్వీసులను నిలిపివేసినట్లు తహసీల్దార్ జి.శ్రీనివాసయాదవ్ తెలిపారు. చేపల వేటకు వెళ్లొద్దన్నారు. లోతట్టు ప్రాంతాలు అప్రమత్తంగా ఉండాలన్నారు.



వరద నీటితో నిండిపోయిన అమరేశ్వరఘాట్

పులిచింతలలో తగ్గిన ఉధృతి

పులిచింతల ప్రాజెక్టు నుంచి నీటి ప్రవాహ ఉధృతి కొంతమేర తగ్గింది. ప్రాజెక్టు నుంచి ఆదివారం రాత్రి 6.50 లక్షల క్యూసెక్కులకు పైగా నీటిని వదలగా సోమవారం సాయంత్రానికి 5,43,617 క్యూసెక్కులు వదులుతున్నారు. 21 గేట్లను పైకి ఎత్తారు. ఇందులో ఐదు గేట్లు 5 మీటర్లు, 13 గేట్లు మూడు మీటర్లు, మూడు గేట్లు రెండు మీటర్లు మేర పైకి ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 41.93 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

8,467.68 హెక్టార్లలో పంట నష్టం



దాచేపల్లిలో నీటిలో నానుతున్న పత్తి మొక్కలు

జిల్లాలో 176 గ్రామాల పరిధిలో 8,574 మంది రైతులకు చెందిన 8,002 హెక్టార్లలో వ్యవసాయ పంటలన నష్టపోయినట్టు ప్రాథమికంగా నిర్ధారించామని జిల్లా వ్యవసాయశాఖాధికారి ఐ మురళి 'సాక్షి'కి తెలిపారు. ఇందులో అత్యధికంగా పత్తి 6,928 హెక్టార్లు, వరి 878 హెక్టార్లు, కంది 148 హెక్టార్లు, మినుము 33 హెక్టార్లు, జూట్ 15 హెక్టార్లలో ముంపుకు గురైంది. మరోవైపు జిల్లాలో 525 రైతులకు చెందిన 465.68 హెక్టార్లలో ఉద్యాన పంటలు వర్షాలకు నష్టపోయినట్టు జిల్లా ఉద్యాన శాఖ అధికారి సీహెచ్‌వీ రమణారెడ్డి తెలిపారు. వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు, సిబ్బంది నీట మునిగిన పంట పొలాలను పరిశీలిస్తున్నారు. వరద నీటితో పంటలు నష్టపోకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు రైతులకు సలహాలు, సూచనలు అందజేస్తున్నారు. ప్రాథమికంగా ముంపునకు గురైన పంటల వివరాలను నమోదు చేస్తున్నారు.

డ్రోన్లతో పర్యవేక్షణ

పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ అమరావతి మండల పరిధిలోని కృష్ణానది పరివాహక ప్రాంతాల్లో ముంపు ప్రాంతాలను డ్రోన్లతో పర్యవేక్షించారు. బోటు ద్వారా పలు ప్రాంతాల్లో నీట మునిగిన ఇళ్లను సందర్శించిన ఆయన మరికొన్ని ఇళ్లను డ్రోన్‌తో పరిశీలించారు.



డ్రోన్ల ద్వారా వరద ముంపు ప్రాంతాలను పరిశీలించే ముందు డ్రోన్ యంత్రాలను చూస్తున్న జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోర్

అమరావతి జలమయం



అమరావతిలోని క్రోసూరు రోడ్డులో వరద నీరు

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతి జలమయమైంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు నుంచి వస్తున్న వరదనీటితో పాటుగా మునేరు వరద కూడా కలవటంతో కృష్ణానది ప్రవాహం వేగవంతమై ఆదివారం రాత్రి 12గంటల నుంచి గంటకు రెండు అడుగుల చొప్పున నీటిమట్టం పెరిగింది. దీంతో వరదనీరు గ్రామంలోని సంధ్యా థియేటర్ బజారు, పూజారుల బజారు, సాయిబాబా గుడి బజారు, గవర్నమెంట్ హాస్పటల్ బజారు, సత్రంబజారు, మునసబుగారి బజారు, పల్లపువీధి, శివగంగవీధి, ముస్లిం కాలనీ, గోపాల్‌నగర్ తదితర ప్రాంతాలలో ఎటు చూసిన వరద నీరు 4 నుంచి 5 అడుగుల మేర ప్రవహించి ఇళ్ల లోకి చేరింది. కొన్ని ప్రాంతాల ప్రజలు డాబాలపైన తలదాచుకోగా, మరికొన్ని ప్రాంతాల ప్రజలు పునరావాస కేంద్రాలకు చేరుకున్నారు. అమరావతి దేవాలయం, పోలీసుస్టేషన్ పరిసరాలలోకి వరద నీరు చేరింది.

బలహీనంగా కరకట్ట

వైకుంఠపురం వద్ద ఆదివారం అర్ధరాత్రికి కృష్ణానది కరకట్ట మట్టానికి వరద నీరు చేరింది. ఈక్రమంలో గ్రామస్తులు కరకట్ట రెండు మూడుచోట్ల బలహీనంగా ఉండటాన్ని గమనించి అధికారులకు సమాచారమిచ్చారు. సమాచారం తెలుసుకున్న పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, జాయింట్ కలెక్టర్ సూరజ్, ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ వైకుంఠపురం చేరుకున్నారు. గ్రామస్తులతో చర్చించి కరకట్ట బలహీనంగా ఉన్న చోట్ల గ్రామస్తుల సాయంతో గ్రావెల్‌తో కరకట్ట బలోపేతం చేశారు. సోమవారం ఉదయం కల్లా కరకట్టపై సుమారు మూడు నుంచి 4 అడుగల మేర గ్రావెల్ పరిచారు. ఈ నేపథ్యంలో కరకట్టకు ఎటువంటి ఇబ్బంది కలుగకపోవటంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.



వైకుంఠపురం వద్ద కరకట్టను పరిశీలిస్తున్న అధికారులు

మత్స్యకారుల ఇళ్లలోకి నీరు



రామాపురం మత్స్యకారుల కాలనీలో నిలిచిన నీరు

దాచేపల్లి మండలం రామాపురం గ్రామ మత్స్యకారుల కాలనీ వరద నీటిలో ఉంది. సోమవారం వరద తీవ్రత తగ్గకపోవటంతో మత్స్యకారుల ఇళ్లలోకి ఇంకా వరద నీరు పారుతున్నాయి. స్థానిక హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో మత్స్యకారులు తలదాచుకుంటున్నారు. వరద నీరు తగ్గటంతో పునరావాస కేంద్రంలో ఉన్న మత్స్యకారులు ఇళ్లను చూసి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్లలో ఇంకా నీరు ఉండటంతో ఎప్పుడు తగ్గుముఖం పడతాయా అని ఎదురు చూస్తున్నారు. వరద తగ్గుముఖం పట్టిన తరువాత ఇళ్లను శుభ్రం చేసుకోవటం వీరికి కత్తిమీద సాము లాంటిది. వరద తీవ్రతతో కొంతమంది మత్స్యకారుల పడవలు, బోట్లు, వలలు నదిలో కొట్టుకుపోయాయి. ఆర్థికంగా నష్టపోయారు.

న్యూస్‌రీల్

గ్రామ, వార్డు సచివాలయాల్లో కంట్రోల్ రూమ్

జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు



నరసరావుపేట: భారీ వర్షాల నేపథ్యంలో ప్రతి గ్రామ, వార్డు సచివాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేయాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామంలోనూ హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేసి రోగాలు ప్రబలకుండా చూడాలన్నారు. హెల్త్ క్యాంపుల్లో పాముకాటు మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. గ్రామాల్లో విస్తృతంగా క్లోరినేషన్, పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు జిల్లాలో కురిసిన వానల ప్రభావంపై అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో జరిగిన ఆస్తి నష్టం, పశు-పంట నష్టం అంచనా వివరాలను నేటి సాయంత్రంలోగా అందించాలన్నారు. దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులకు వెంటనే మరమ్మతులు చేపట్టి రాకపోకలు కొనసాగేలా చూడాలన్నారు. పరిస్థితులు మెరుగయ్యే వరకూ పునరావాస కేంద్రాలను కొనసాగించాలన్నారు. విద్యాశాఖ అధికారులు పాఠశాలల పరిస్థితిని సమీక్షించుకోవాలన్నారు. అన్ని చోట్లా విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలన్నారు. జిల్లా అధికారులు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

నేడు పాఠశాలలకు సెలవు

డీఈఓ వెంకటేశ్వర్లు

నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లా పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు మంగళవారం సెలవు ప్రకటిస్తున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో భారీ వర్షాల కారణంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పరిహార సెలవు దినంగా ప్రకటిస్తున్నట్టు వివరించారు. పాఠశాలల విద్యార్థులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉత్తర్వులు ఖాతరు చేయకుండా పాఠశాలలు తెరిచే యాజమాన్యలపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

గల్లంతైన వ్యక్తి కోసం ముమ్మర గాలింపు



అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు నుంచి భారీగా వదిలిన నీరు తాడువాయి వద్ద చప్టాపై ప్రవహిస్తుండగా, ఆ ప్రవాహంలో ఆదివారం రాత్రి గల్లంతైన భూక్యా గోపినాయక్ కోసం అచ్చంపేట సీఐ వెంకటప్రసాద్, తహసీల్దార్ శ్రీనివాసయాదవ ఆధ్వర్యంలో సోమవారం ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఫ్ బృందాలను రప్పించారు. గల్లంతైన ప్రదేశం, సమీపంలోని కృష్ణానదిలో పడవల ద్వారా ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. అయినా ఫలితం లేకపోయింది. సోమవారం సాయంత్రం వరకు ఆచూకీ కనిపించలేదు.

టీడీపీ కార్యకర్తల వీరంగం

మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి హాస్పిటల్ ముందు డ్యాన్సలు



నరసరావుపేట: జొన్నలగడ్డ గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు ఆదివారం రాత్రి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి నివాసం ఉంటున్న హాస్పిటల్‌కు ఎదురుగా వీరంగం వేశారు. వినాయక చవితికి కావాల్సిన వినాయకుని విగ్రహాలు కొనుగోలు చేసి వాటిని ట్రాక్టర్లపై పెట్టి ఊరేగింపుగా తమ గ్రామానికి బయలుదేరి మార్గంమధ్యలో గుంటూరు రోడ్డులోని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి నివాసం ఉంటున్న హాస్పిటల్ ముందుకు రాగానే జెండాలు చేతపట్టుకొని బాణాసంచా కాల్చి డ్యాన్సలు వేస్తూ అక్కడే కొద్దిసేపు నిలబడి దమ్ముంటే బయటకు రావాలంటూ సవాలు విసురుతూ అల్లరి చేశారు. కొద్దిసేపటికి తర్వాత అక్కడికి చేరుకున్న పోలీసులు వారిని పంపించి వేశారు.

మహానేతకు ఘన నివాళి

- జిల్లా వ్యాప్తంగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి
- వాడవాడలా సేవా కార్యక్రమాలు

సాక్షి, నరసరావుపేట: దివంగత ముఖ్యమంత్రి, మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 15వ వర్ధంతి కార్యక్రమాలు పల్నాడు జిల్లాలోని వాడవాడల నిర్వహించారు. వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. విగ్రహాల వద్ద నేతలు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఆసుపత్రులలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ నేతలు, వైఎస్సార్ అభిమానులు మహానేత చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. ఆయన పాలనలో పేదలకు అందిన మేలును వివరించారు. ఆయన స్ఫూర్తితో ఏర్పడిన వైఎస్సార్ సీపీ దివంగత నేత వైఎస్సార్ ఆశయాలను కొనసాగిస్తోందన్నారు.



సత్తెనపల్లిలో వైఎస్సార్ విగ్రహ ప్రతిమకు నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి అంబటి రాంబాబు

చవితి ఉత్సవాలకు ముందస్తు అనుమతులు తప్పనిసరి

- నిర్వాహకులకు సూచించిన జిల్లా కలెక్టర్, ఎస్పీలు
- ప్రశాంత వాతావరణంలో ఉత్సవం జరగాలి
- అధికారులు ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశం

నరసరావుపేట: వినాయక చవితి పండగకు ప్రభుత్వం ఏర్పాటుచేసిన సింగిల్ విండో పద్ధతిలో తప్పకుండా ముందస్తు అనుమతులు తీసుకోవాలని జిలా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఉత్సవ నిర్వాహకులకు సూచించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో వినాయక చవితి పండుగ ఉత్సవాలపై జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావుతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రశాంతమైన భక్తిపూర్వక వాతావరణంలో వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించుకోవాలన్నారు. పర్యావరణానికి నష్టం వాటిల్లకుండా విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. నిబంధనలు పాటించాలన్నారు. నిర్దేశిత నిమజ్జన ప్రదేశాలలో ప్రణాళిక ప్రకారం విగ్రహ నిమజ్జనం చేసేందుకు సహకరించాలని కోరారు. నిమజ్జన ప్రదేశాలలో గజ ఈత గాళ్లను, అవసరమైన చోట పడవలను అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారిని ఆదేశించారు. విగ్రహాలు ఏర్పాటు చేసిన చోట సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఎస్పీ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించే విధంగా అవగాహన కల్పించాలన్నారు. విగ్రహాలు ఏర్పాటు చేసే ప్రదేశాల విషయంలో సమస్యలు లేకుండా చూడాలన్నారు. రాజకీయ గుర్తులు, రంగులు లేకుండా విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 284 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఇప్పటివరకు 115 నిమజ్జన ప్రదేశాలను గుర్తించామన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.వి నాయకం, రెవెన్యూ డివిజినల్ అధికారులు పి.సరోజినీ, రామాకాంత్‌రెడ్డి, పర్యావరణ శాఖ అధికారి నారాయణ, రోడ్లు భవనాల శాఖాధికారి రాజానాయక్, డీపీవో భాస్కర్‌రెడ్డి, విద్యుత్ శాఖ ఈఈ శ్రీనివాసరావు, ఎస్ఎస్పీ ఎస్ఈ వరలక్ష్మి, జిల్లా ఎండోమెంట్స్ అధికారి ఆంజనేయులు, మునిసిపల్ కమిషనర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొనారు.



కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష చేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ శ్రీనివాసరావు